కోదండరామ్‌కు పండుగ శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న టీజేఎస్ శ్రేణులు

అల్వాల్: టీజేఎస్ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో బుధవారం ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో నెలకొన్న సమస్యలు, పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు భద్రగామ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి దయాకర్, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి గీతాంజలి, ఉపాధ్యక్షులు రెడ్డిపల్లి శ్రీనివాస్, జవహర్‌నగర్ అధ్యక్షులు విజయ్‌కుమార్, లక్ష్మణ్, వెంకటాచారి, దయాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని కలిగి ఉండాలి



అనాథాశ్రమంలో బాణాసంచా అందజేస్తున్న విద్యార్థులు

బోడుప్పల్: చిన్నతనం నుంచి విద్యార్థులు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల డైరెక్టర్ శ్రవణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. చెంగిచర్లలోని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల విద్యార్థులు దీపావళి పండుగను పురస్కరించుకుని రామకంటి రమేష్ స్థాపించిన మాతృ అభయ అనాథాశ్రమంలోని అనాథ పిల్లలకు బాణాసంచాను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనతో పాటు ఎలాంటి ఆసరా లేని పిల్లలు సంతోషంగా ఉండేలా చేయడం మనందరి బాధ్యత అన్నారు. డైరెక్టర్ అనిల్ అయ్యంగార్, ప్రిన్సిపాల్ నీలిమా, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ శ్రేణుల సంబురాలు

మల్లాపూర్: విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనను విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) తిరస్కరించినందుకు బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు మల్లాపూర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి మిఠాయిలను పంచిపెట్టి విజయోత్సవ సంబురాలను నిర్వహించుకున్నారు. ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేద ప్రజల పక్షాన పోరాడే ఏకైక పార్టీ బీఆర్‌ఎస్ మాత్రమేనన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న కళాశాల జీఎం శ్రీనివాస్

కుషాయిగూడ: ఈసీఐఎల్‌లోని నారాయణ జూనియర్ కళాశాలలో బుధవారం క్రీడా పోటీలను కళాశాల జీఎం కె.శ్రీనివాస్ హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. కళాశాల ఏజీఎం శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వేణుకుమార్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



తాగునీటి నల్లాను ప్రారంభించిన మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: దశల వారీగా మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్‌లోని 7, 13,27వ డివిజన్ల పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీరోడ్లు పనులు, కబరిస్తాన్ ప్రహరీ, డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద సింథటిక్ వాటర్ ట్యాంక్‌లు, అభివృద్ధి పనులకు ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరాభివృద్ధిలో తనవంతు కృషి చేస్తున్నట్లు వివరించారు. మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్, కార్పొరేటర్లు దానగల్ల అనితాయాదగిరి, అంజలీదేవి శ్రీధర్‌గౌడ్, లతారాంచంద్రారెడ్డి, రాసాల వెంకటేష్‌యాదవ్, నేతలు హరినాథ్‌రెడ్డి, దేవరకొండ వీరాచారి, స్థానిక నేతలు, అధికారులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న విజయప్రసాద్‌రెడ్డి

గౌతంనగర్: దీపావళి పర్వదినం సందర్భంగా గౌతంనగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జుననగర్‌లో నివసించే ప్రముఖ సంఘ సేవకులు విజయప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం కాలనీ అసోసియేషన్ గ్రౌండ్‌లో పారిశుద్ధ్య కార్మికులు చీరలు, ఇతర వస్త్రాలు పంపిణీ చేశారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులు అన్నదానం నిర్వహించారు. రాజలింగం, ఎస్ఎఫ్ఏ సంజీవ, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

సదర్‌కు ఆహ్వానం



ఎంపీ ఈటలకు ఆహ్వానం అందజేస్తున్న దృశ్యం

రామంతాపూర్ : దీపావళి పర్వదినం సందర్భంగా గురువారం రాత్రి ఓల్డ్ రామంతాపూర్‌లో నిర్వహించే సదర్ ఉత్సవానికి హాజరు కావాలని ఎంపీ ఈటల రాజేందర్‌కు బుధవారం రాష్ట్ర యాదవ సంఘం నేత, బీజేపీ సీనియర్ నాయకులు వల్లపు జగన్‌యాదవ్ ఆహ్వానపత్రం అందజేశారు. రామంతాపూర్ యాదవ సంఘం నేతలు పాల్గొన్నారు.



లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో బొమ్మల కొలువు



జేజీఆర్ స్కూల్‌లో టపాసులు కాలుస్తూ..

పాఠశాలల్లో దీపావళి సంబురం

ఉప్పల్/మల్కాజిగిరి జోన్ పరిధిలో బుధవారం ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మామిడి తోరణాలు, దీపాలతో అలకరించి ధనలక్ష్మీదేవి పూజ చేశారు. అనంతరం దీపావళి ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. బాణాసంచా కాలుస్తూ సంబురంగా వేడుకల్లో పాల్గొన్నారు.

– ఉప్పల్/మల్కాజిగిరి జోన్ బృందం



దక్కన్ గ్లోబల్ స్ప్రింగ్స్ పాఠశాలలో..



ఎస్సై కోటేశ్వర్‌రావును సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది



అనురాగ్ స్కూల్‌లో దీపారాధన చేస్తూ..

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని మర్రిగూడలో రూ.20 లక్షలతో చేపట్టనున్న శ్మశానవాటికలోని బర్నింగ్ ప్లాంట్, స్నానపు గదులు, బాత్‌రూమ్‌ల నిర్మాణానికి, పిట్టల బస్తీలో రూ.5.4లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులకు స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. డీఈ రూప, ఏఈ స్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

నాచారంలో..

ఎరుకల బస్తీలో మురుగునీటి సమస్య పరిష్కారానికి రూ.7 లక్షలతో చేపట్టబోయే డ్రైనేజీ పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్, జలమండలి డీజీఎం సతీష్‌కుమార్, మేనేజర్ సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

రోడ్డు పనులు ప్రారంభించండి

కుషాయిగూడ: చక్రీపురం శ్రీలక్ష్మి ప్రైడ్ కాలనీలో మంజూరైన రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని బుధవారం కాలనీవాసులు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి స్పందించి జోనల్ కమిషనర్‌తో మాట్లాడగా.. పనులు వెంటనే ప్రారంభించాలని మున్సిపల్ అధికారులను జోనల్ కమిషనర్ ఆదేశించారు. బీఆర్‌ఎస్ నేతలు మహేష్‌గౌడ్, కాలనీ అధ్యక్షులు ఆర్.సుధాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిడి జంగారెడ్డి, కోశాధికారి నర్సింహారెడ్డి, సలహాదారులు రామచందర్, సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

హోమిజే బాబా ఆశయసాధనకు కృషి చేయాలి



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

కాప్రా: డాక్టర్ హోమి జహంగీర్ బాబా ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం ఏఎస్‌రావునగర్‌లో డాక్టర్ హోమి జహంగీర్ బాబా 115వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా హోమిజే బాబా ఫంక్షన్‌హాల్ వద్ద ఆయన విగ్రహాన్ని స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషాసోమశేఖర్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ కాన్ఫరెన్స్ సదస్సుకు..

త్రిపుర గవర్నర్‌కు ఆహ్వానం

మల్లాపూర్: బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో డిసెంబర్ 15న న్యూఢిల్లీలో ప్రతిష్టాత్మకంగా 27 రాష్ట్రాలు, 8 దేశాల నుంచి దాదాపు 2 వేలమంది ప్రతినిధులచే నిర్వహించే 17వ నేషనల్ కాన్ఫరెన్స్ సదస్సుకు ముఖ్యఅతిథిగా త్రిపుర రాష్ట్రగవర్నర్ నల్లు ఇంద్రాసేనారెడ్డి రావాలని కోరుతూ.. అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ ఆహ్వానపత్రాన్ని అందజేశారు. గవర్నర్‌తో పాటు ఢిల్లీ కార్మికశాఖమంత్రి రాజ్‌కుమార్ ఆనంద్, కారోల్ బాగ్ ఎమ్మెల్యే విషేష్ రవిని ఆహ్వానించినట్లు నల్లా తెలిపారు. బోసుపల్లి ప్రతాప్, విష్ణు, ప్రకాష్, నవీన్‌కుమార్ తదితరులున్నారు.



ఆహ్వానపత్రాన్ని అందజేస్తున్న నల్లా రాధాకృష్ణ

ఎప్పటికప్పుడు విద్యుత్ సమస్యల పరిష్కారం

అల్వాల్: అల్వాల్ డివిజన్ స్ట్రీట్‌లైట్ అధికారులతో బుధవారం కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అల్వాల్ డివిజన్ పరిధిలో విద్యుత్‌దీపాలు వెలగడం లేదని, వేంకటేశ్వర పార్కులో హైమాస్ట్ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, అవసరం ఉన్నచోట కాలనీవాసులతో కలిసి సహకరించాలని ఆమె అధికారులను కోరారు. డీఈ రఘుపతిరెడ్డి, ప్రసాద్, రమేష్, శ్రీకాంత్, నేతలు మల్లేష్‌గౌడ్, రమేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి

సమగ్ర కుటుంబ సర్వేపై సమీక్ష

అల్వాల్: జీహెచ్ఎంసీ అల్వాల్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి రాజకీయ, కుల సర్వేకు ఏన్యుమరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బలహీన వర్గాల సంక్షేమం కోసం అన్ని రంగాల్లో అవకాశాలను మెరుగుపరుచుకునేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. ప్రతీ ఇంటికి వెళ్లి ఈ సర్వేను చేపట్టాలని సూచించారు. ఏఎంసీ నర్సింహారెడ్డి, ఏఎంహెచ్ఓ రజిని, ప్రాజెక్టు అధికారి మధుసూదన్, డీఈ ప్రశాంతి తదితరులున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

కుషాయిగూడ: మీర్‌పేట-హెచ్‌బీకాలనీ డివిజన్ మంగాపురం కాలనీలో నిర్మిస్తున్న రోడ్డు పనులను బుధవారం కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కాంట్రాక్టర్ రవీంద్రసాగర్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, కనకయ్య, జయమోహన్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఎస్‌రావు విజ్ఞానోత్సవాలు

కాప్రా: డాక్టర్ ఏఎస్‌రావు విజ్ఞాన వేదిక, విజ్ఞానదర్శిని తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో డాక్టర్ ఏఎస్‌రావు విజ్ఞానోత్సవాలు నిర్వహిస్తున్నారు. భవానీనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు పాల్గొని మాట్లాడుతూ.. ఈసీఐఎల్ ప్రాంతం అభివృద్ధికి డాక్టర్ ఏఎస్‌రావు ప్రధానపాత్ర పోషించారని, ఆయన చేసిన కృషి ఈసీఐఎల్ పరిశ్రమల అభివృద్ధికి దోహదపడిందన్నారు. ఎలక్ట్రానిక్ రంగంలో ప్రపంచంలోనే భారత్‌కు ఓ స్థానాన్ని కల్పించారని తెలిపారు. అనంతరం డాక్టర్ ఏఎస్‌రావు బయోపిక్ ప్రదర్శించారు. యాదగిరిరావు, రుక్కయ్య, శేఖర్, రమేష్, త్రిమూర్తులు, హనుమంతరావు, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలి

బోడుప్పల్: చెంగిచర్లలోని డబుల్ బెడ్రూం ఇళ్లకు తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ కమిషనర్‌కు అంబేద్కర్‌నగర్ డబుల్‌బెడ్రూం అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌చారి, కార్యదర్శి హసన్‌ఖాన్ కోరారు. ఇళ్లు కేటాయించి ఏడాది గడుస్తున్నా ఇప్పటి వరకు తాగునీటి సౌకర్యం లేదన్నారు. ఇక్కడ ఇళ్లు పొందిన వారు పేద, మధ్యతరగతి వారని వారికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని కోరారు.

సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వారిపై ఫిర్యాదు

ఉప్పల్: సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వ్యక్తులపై మేడ్చల్, మల్కాజిగిరి బీఆర్‌ఎస్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి ఉప్పల్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. ప్రశాంత్ రెడ్డి, జితేందర్ (జిత్తు), ఎస్‌కె ఖయ్యూం, చంద్రశేఖర్ రెడ్డి, సునీల్‌రెడ్డి, లింగంపల్లి రామకృష్ణ, అల్వాల భాస్కర్‌లు రాగిడి లక్ష్మారెడ్డి ప్రతిష్టను దెబ్బతీసేలా వీడియో, పోస్టులు సోషల్ మీడియాలో సర్క్యులేట్ చేస్తున్నారన్న ఆరోపణలతో ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డి తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం

మల్కాజిగిరి: విద్యార్థిని అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సునీల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గౌతంనగర్‌కు చెందిన స్వాతి బ్యూటీషియన్. కాగా ఆమె కుమార్తె (15) స్థానిక ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఈనెల 29న ఉదయం ఇంటి నుంచి స్కూల్‌కు వెళ్లింది. మధ్యాహ్నం సమయంలో స్కూల్ ప్రిన్సిపాల్ స్వాతికి ఫోన్‌చేసి స్కూల్‌కు రాలేదని చెప్పింది. దీంతో ఆమె ఆచూకీ కోసం వెతకగా.. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసులో నిందితుడికి జైలు



వెంకటేష్

మల్కాజిగిరి: బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి పోక్సో కోర్టు ఐదేళ్ల జైలుశిక్ష విధించింది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మౌలాలి ఈస్ట్ ప్రగతినగర్‌కు చెందిన కావలి వెంకటేష్ (34) ప్రైవేట్ ఉద్యోగి. 2017లో బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో కేసు నమోదైంది. బుధవారం మేడ్చల్, మల్కాజిగిరి పోక్సో కోర్టు న్యాయమూర్తి విచారణ జరిపి నిందితుడికి ఐదేళ్ల జైలుశిక్ష విధించారని తెలిపారు.

ఆకస్మిక తనిఖీ

కాప్రా: జమ్మిగడ్డలోని కుషాయిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.రఘునాథస్వామి ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి డయగ్నొస్టిక్ మినీహబ్‌లో ఎక్స్‌రే, ఈసీజీ తదితర సేవలను సమీక్షించారు.